సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం । 15 । ఏప్రిల్ । 2024



మావోయిస్టుల బంద్ పిలుపుతో..

మావోయిస్టులు సోమవారం బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసులు అప్రమత్తమై తనిఖీలు చేపడుతున్నారు.

8లో



నల్ల సూరీలకు నిరాశే..!

సింగరేణి కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ రద్దు కలగానే మిగిలింది. ఏళ్లు గడిచినా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు.

8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం పెద్దమ్మ తల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి వసంత నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయప్రాంగణం కిటకిటలాడింది. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు, లక్ష కుసుమార్చన, నాదనీరాజనం, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, సూక్తపారాయణం, చండీసప్తసతీ పారాయణం, హోమాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం పూజలు నిర్వహించారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్

మణుగూరు టౌన్: రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్య సాధనతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ తెలిపారు. ఆదివారం మణుగూరులో ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు కృష్ణం రాజు అధ్యక్షతన నిర్వహించిన బ్రాంచి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ బలోపేతానికి సూచనలు చేశారు. సభ్యత్వ నమోదుతోపాటు ఏరియా కార్మికుల సమస్యలపై స్థానిక నాయకులతో చర్చించారు. నాయకులు గట్టయ్య యాదవ్, షబుద్దీన్, నాయుడు, మస్తాన్, ప్రధాన ఆర్గనైజింగ్ సెక్రటరీ జయ రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

కొత్తగూడెంటౌన్: ఎండాకాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవించే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. కొత్తగూడెంలో ఆదివారం అగ్నిమాపక శాఖ వారోత్సవాలను ఫైర్ స్టేషన్ ఆఫీసర్ గుండా పుల్లయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన డీఎస్పీ అగ్నిమాపక సిబ్బందితో కలిసి వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. అగ్ని ప్రమాదం జరిగితే తక్షణమే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనునట్లు కొత్తగూడెం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ గుండా పుల్లయ్య తెలిపారు. కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ ఎం.కరుణాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దస్తగిరి, షేక్ సైదులు, శ్రీనివాసరావు, కె.శ్రీను, ఆజార్, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం గాజులరాజంబస్తీలో మరమ్మతులకు గురైన చేతిపంపు



కూలీలైన్ ఏరియాలో పనిచేయని పవర్ బోరు, నిరుపయోగంగా ట్యాంక్



ప్రత్యామ్నాయం ఏది?

అడుగంటుతున్న నీటి వనరులు

- మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు శూన్యం
- ఎండలు పెరుగుతుండటంతో పుర ప్రజల ఆందోళన
- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని పవర్‌బోర్లు, చేతిపంపులు
- కిన్నెరసాని పైపులైన్ల లీకేజీలతో కలుషితమవుతున్న తాగునీరు

కొత్తగూడెంఅర్బన్: వేసవిలో ఎండలు ముదురుతున్న నేపథ్యంలో నీటి వనరులు అడుగంటుతున్నాయి. నీటి ఎద్దడి రాకుండా మున్సిపాలిటీల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో 80 శాతం ప్రజలు కిన్నెరసాని నీటిని తాగునీరుగా వినియోగిస్తారు. మిగతా ప్రజలు వాటర్‌ప్లాంట్ నీటిని, మరికొందరు సింగరేణి వాటర్‌ను తాగునీరుగా వినియోగిస్తారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీ ప్రజలకు నీటి సరఫరా జరుగుతోంది. కిన్నెరసాని జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 407 అడుగులు కాగా, ప్రస్తుతం 394 అడుగులకు పడిపోయింది. ఎండలు ముదురుతుండటంతో జలాశయం నీటి మట్టం ఇంకా తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలుంటాయి. ఇక ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలలో ఎక్కువ మందికి సింగరేణి యాజమాన్యం తాగునీరు సరఫరా చేస్తోంది. సింగరేణి సంస్థ అనివార్య కారణాలతో నీటి సరఫరా నిలిపివేస్తే ఆయా మున్సిపాలిటీల అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉంది.

జిల్లా కేంద్రంలో ఇలా..

- కొత్తగూడెం జిల్లా కేంద్రంలో గౌతంనగర్ ఏరియాలో పవర్ బోరు రెండేళ్లుగా పని చేయడం లేదు. దీంతో కిన్నెరసాని నీరు రాకపోతే ఆ ఏరియాలోని 30 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి.
- గాజులరాజంబస్తీలో ఉన్న చేతిపంపు బోరు తరుచుగా మరమ్మతులకు గురవుతోంది. పట్టణంలో పలుచోట్ల రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ సమయంలో పని చేయని, అడ్డుగా ఉన్న చేతిపంపులను తొలగించారు.
- కూలీలైన్ ఏరియాలోని పవర్ బోరు రెండు నెలలుగా పని చేయడం లేదు. ఈ ప్రాంతంలో దాదాపు 20 రోజులుగా కిన్నెరసాని నీరు సరఫరా కావడంలేదు. దీంతో సుమారు 40 కుటుంబాల వారు తాగునీటికి అల్లాడుతున్నారు.

పనిచేయని పవర్‌ప్లాంట్లు, చేతిపంపులు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో నీటి సమస్యలు తలెత్తకుండా గతంలో ఏర్పాటు చేసిన చేతిపంపుల బోర్లు, పవర్‌ప్లాంట్‌లు ప్రస్తుతం పని చేయడం లేదు. ఒక్కో మున్సిపాలిటీలో 120 నుంచి 180 వరకు చేతిపంపులు ఉన్నాయి. పట్టణాల్లో చాలా వరకు పవర్‌బోర్లు మరమ్మతులకు గురైనా ఎవరూ పట్టించుకోవడంలేదు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో కిన్నెరసాని పైపులైన్లు తరచూ లీకవుతున్నాయి. లీకేజీల మరమ్మతులకు రెండు మున్సిపాలిటీల నుంచి నెలకు రూ. 6 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా మళ్లీ అదే స్థానంలో పైపులైన్ల లీకవుతున్నాయి. మరమ్మతు పనులు నాసిరకంగా చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోంది. పైపులైన్లు లీకై తాగునీరు కలుషితమైతే పుర ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కిన్నెరసాని పైపులైన్లకు మున్సిపల్ అధికారులు శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు. ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీల్లో చేతి పంపులు, పవర్‌బోర్లకు మరమ్మతులు పూర్తి చేసి, వినియోగంలోనికి తీసుకురావాల్సి ఉంది.

చర్యలు తీసుకుంటున్నాం



కొత్తగూడెం పట్టణంలో నీటి ఎద్దడి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో చేతిపంపులు, పవర్‌బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నాం. కిన్నెరసాని నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

–శేషాంజన్‌స్వామి,
కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్

వైభవంగా ధ్వజపట లేఖనం



అగ్ని సమీకరణ చేస్తున్న అర్చకులు



గరుత్మంతుని చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నేడు రామాలయంలో ధ్వజారోహణం

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలో వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం గరుడాధివాసం, ధ్వజపట లేఖనంలను శాస్త్రోక్తంగా జరిపారు. బ్రహ్మోత్సవాలకు ప్రధాన సంకేతమైన గరుత్మంతుడిని వస్త్రంపై బొమ్మగా లిఖించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా ధ్వజపట లేఖనం వేడుకను జీయర్ మఠంలో పూర్తి చేశారు. ప్రత్యేక పూజలు జరిపి గరుత్మంతుని చిత్రపటానికి హారతి సమర్పించారు. ఈ సందర్భంగా త్రిదండి రామానుజ జీయర్ స్వామి భక్తులకు ప్రవచనం అందజేశారు. ఉదయం గరుడధ్వజాధివాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని భూతద్దంతో అగ్నిసమీకరణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, చతుఃస్థానార్చన జరపనున్నారు. సంతానం ప్రాప్తి కోసం గరుడప్రసాదాన్ని మహిళలకు ఈ సందర్భంగా అర్చకులు అందజేయనున్నారు. ఈ పూజల్లో ఈఓ ఎల్.రమాదేవి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాలలో..

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడాధివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ అధికారి అనిల్ కుమార్, అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, రామభద్రాచార్యులు, రవికుమార్ శర్మ, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



గరుడాధివాసం నిర్వహిస్తున్న అర్చకులు

జమలాపురంలో ఎదుర్కోలు వేడుక

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఐదో రోజైన ఆదివారం శ్రీవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం చేశారు. యాగశాలలో విష్వక్సేన పూజ నిర్వహించారు. పుణ్యావచనం, అనుష్టానాలు, హోమం జరిపించాక, శ్రీవేంకటేశ్వర స్వామి వారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను నూతన వస్త్రాలతో అలంకరించారు. కాగా, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ఎదుర్కోలు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి, అమ్మవార్ల గుణగణాలను అర్చకులు వివరించారు. శ్రీవారి తరఫున ఆలయ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, విజయదేవశర్మ, వేదపండితులు అనంతశయనాచార్యులు, అమ్మవార్ల తరఫున వసంతకుమార్ శర్మ, కాసులనాటి రామకృష్ణశాస్త్రి, రఘురామకృష్ణ, వెంకటరమణ పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబా సాహెబ్ అంబేద్కర్ అని, ఆయన అడుగుజాడల్లో అందరూ నడవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంటరానితనం వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతూ, ఎదురైన అవమానాలను ఆయుధంగా మలుచుకుని డాక్టర్ అంబేద్కర్ ప్రపంచ మేధావిగా ఎదిగారని గుర్తుచేశారు. సమాజంలో ఎవరికీ ఎవరూ తక్కువ కారంటూ, ప్రజలు స్వేచ్ఛగా జీవించడానికి కావాల్సిన అన్ని హక్కులను రాజ్యాంగంలో పొందుపర్చారని చెప్పారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎన్నో సేవలను అందించారని, ఆర్‌బీఐ ఏర్పాటుకు మూలకారకులు అంబేద్కర్ అని వివరించారు. చదువే మార్పుకు మూలమని, ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకోవాలని చెప్పారని గుర్తుచేశారు. చదువు మనిషికి మూడో నేత్రమని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఎస్సీ సంక్షేమాధికారి అనసూర్య, బీసీ సంక్షేమాధికారి ఇందిర, మైనార్టీ వెల్ఫేర్ శాఖ అధికారి సంజీవరావు, కలెక్టరేట్ ఏఓ గన్యా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రియాంక, అధికారులు

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి

కొత్తగూడెంటౌన్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోహిత్‌రాజు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి, దేశానికి దిశా నిర్దేశం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, సీఐలు నాగరాజు, కరుణాకర్, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్ తదితరులు

రక్తదానం అభినందనీయం

కొత్తగూడెంరూరల్: రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణాపాయ స్థితిలో ఎంతగానో ఉపయోగపడుతుందని, రక్తదాతలు అభినందనీయులని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా స్వేరోస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ రవిబాబునాయక్, సీహెచ్‌సీ సూపరిటెండెంటెంట్ ముక్కంటేశ్వరరావు, ఆర్‌ఎంఓ సోమరాజు దొర, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి కనకదుర్గ, స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రిలో 'బొబ్బల నరసింహుడు'

- రామయ్య కంటే ముందే దర్శనం
- పాపికొండల్లో ఉద్భవించిన స్వామివారు
- వైశాఖ పూర్ణిమనాడు తిరుకల్యాణోత్సవం


భద్రాచలం: తిరుమల వెళ్లే భక్తులు శ్రీవారి దర్శనానికి ముందు వరహాస్వామిని దర్శించుకునే ఆనవాయితీ పాటిస్తారు. ఇదే తరహా సంప్రదాయం భద్రాచలంలోనూ ఉంది. ఇక్కడ బొబ్బల లక్ష్మీనర్సింహస్వామిని ముందుగా దర్శించుకునే సంప్రదాయం చాన్నాళ్లు కొనసాగింది. కాలక్రమేణా ఆ ప్రాచుర్యం, ప్రాధాన్యత కోల్పోయింది.

పాపికొండల గుండా..

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ – నైజాం జమానాలో భద్రాచలానికి రవాణా మార్గాలు అంతగా ఉండేవికావు. ఆ రోజుల్లో హస్నాబాద్ (పాల్వంచ) తాలూకా మీదుగా వచ్చే వారు బూర్గంపాడు మండలం గౌమ్మూరు దగ్గర గోదావరి దాటి భద్రాచలం చేరుకునేవారు. రాజమండ్రి వైపు నుంచి వచ్చే భక్తులు కాకులు దూరని కారడవిలో భయంభయంగా ప్రయాణించేవారు. దీంతో గోదావరిలో లాంచీల్లో ప్రయాణిస్తూ పాపికొండల మీదుగా భద్రాచలం చేరుకునేవారు. పాపికొండల దగ్గర గోదావరిలో సుడిగుండాలు సర్వసాధారణం. ఈ సుడిగుండాల పక్కన నుంచి ప్రయాణం చేసే సమయంలో నదీ వంపులో నీటి బుడగల తరహాలో పెడ బొబ్బల శబ్దాలు నదీ గర్భం నుంచి భయంకరంగా వినిపించేవి. కళ్లెదురుగా సుడిగుండాలు, హోరెత్తే పెడబొబ్బలాంటి శబ్దాల తీవ్రతకు భక్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ముందుకు సాగేవారు.

ఉగ్ర గోదావరి

భద్రాచలం పడవ ప్రయాణ మార్గంలో పాపికొండల దగ్గర బొబ్బల శబ్దం వినిపించే స్థలం దగ్గరికి రాగానే శాంతించాలని కోరుతూ భక్తులు పసుపు, కుంకుమలను గోదావరిలో చల్లేవారు. క్షేమంగా తమను భద్రాచలం చేర్చమని మొక్కుతూ కొబ్బరి కాయలను కొట్టి ప్రార్థనలు చేసేవారు. దశాబ్దాల పాటు ఈ ఆనవాయితీ కొనసాగింది. ఇదే సమయంలో పాపికొండల మార్గంలో బొబ్బల శబ్దం ఎందుకు వస్తుందనేది, ఎవరికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలింది. ఒకానొక సమయంలో కరువు వచ్చి గోదావరిలో నీటి మట్టం బాగా తగ్గిపోయింది. ఆ సందర్భంలో బొబ్బలు వచ్చే ప్రదేశంలో గజ ఈతగాళ్లతో వెతికించగా, నదీ గర్భంలో ఓ విగ్రహం కనిపించింది.



భద్రాచలంలోని యోగానంద లక్ష్మీనరసింహుడి ఆలయం

నరసింహావతారం

గోదావరి నదీ గర్భంలో దొరికిన ఆ విగ్రహాన్ని నిశితంగా పరిశీలించి నరసింహుడి విగ్రహంగా పండితులు గుర్తించారు. ఆ స్వామి వారిని భద్రాచలానికి తీసుకొచ్చి రామాలయానికి పడమర దిక్కున ఉన్న గుట్టపై కొలువుదీర్చారు. అప్పటి నుంచి బొబ్బల నరసింహుడిగా పూజించడం ప్రారంభించారు. ఆ తర్వాత కాలంలో పాపికొండల దగ్గర బొబ్బల శబ్దం రావడం తగ్గిపోయింది. దీంతో గోదావరిలో ప్రయాణించిన భక్తులు భద్రాచలం చేరుకుని ముందగా నదీ స్నానం చేసి ఆ తర్వాత తమను క్షేమంగా భద్రాచలం చేర్చిన నరసింహుడిని దర్శించుకునేవారు. ఆ తర్వాత సీతారాముల దర్శనానికి వెళ్లేవారని స్థల పురాణం చెబుతోంది.

కంఠాహారంలో లక్ష్మీదేవి

రాత్రి వేళలో ఆలయం నుంచి పెద్ద ఎత్తున బొబ్బల శబ్దాలు వస్తుండటంతో నరసింహుడిని శాంతింపచేయాలని పండితులు నిర్ణయించారు. దీంతో లక్ష్మీ అమ్మవారికి ఆలయంలో స్థానం కల్పించారు. కంఠాహారంలోకి లక్ష్మీ అమ్మవారిని ఆవాహనం చేసి, ఆ లక్ష్మీహారాన్ని బొబ్బల నరసింహుడికి అలంకరించారు. అప్పటి నుంచి రాత్రి వేళలో ఆలయం నుంచి బొబ్బల శబ్దాలు వినిపించడం తగ్గిపోయిందనేది పలువురు పేర్కొంటున్నారు. లక్ష్మీదేవి రాకతో బొబ్బల నరసింహుడే యోగానంద లక్ష్మీనరసింహుడిగా భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నాడు.

రామయ్య తరఫున పట్టు వస్త్రాలు

ప్రతీ శనివారం, ప్రతీ నెల స్వాతి నక్షత్రం రోజున ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుపుతారు. వైశాఖ శుద్ధ త్రయోదశి నుంచి బహుళ తదియ వరకు లక్ష్మీనరసింహ స్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శుద్ధ చతుర్దశి రోజున నరసింహ జయంతి, వైశాఖ పూర్ణిమ నాడు తిరుకల్యాణ మహోత్సవాలను జరుపుతారు. ఈ వేడుకలకు రామయ్య తరుపున పట్టువస్త్రాలను, తలంబ్రాలను దేవస్థానం అధికారులు అందిస్తారు. బొబ్బల నరసింహుడిని దర్శించుకుంటే భూతప్రేత బాధలు, దుష్టగ్రహ పీడలు తొలగిపోతాయని భక్తులు విశ్వసిస్తారు.

క్షేత్ర రక్షకుడు

గోదావరిపై బ్రిడ్జి నిర్మించక పూర్వం భద్రాచలానికి ఇప్పటిలా భక్తుల రాక లేదు. ఆ రోజుల్లో గోదావరిని దాటడం చాలా కష్టంగా ఉండేది. అలా భద్రాచలం చేరుకున్న భక్తులు తమను క్షేమంగా నదిని దాటించిన యోగా లక్ష్మీనరసింహుడిని దర్శించుకునే వారు. ఆ తర్వాతే రామయ్య దర్శనానికి వెళ్లేవారు. అయితే వంతెన నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగయ్యాక పడవ ప్రయాణాలు కనుమరుగయ్యాయి. బస్ స్టేషన్ వైపు నుంచి ఆలయానికి భక్తుల రాక పెరిగింది. దీంతో గోదావరి – రామాలయం మధ్యన ఉన్న బొబ్బల నరసింహుడు (యోగానంద లక్ష్మీనరసింహుడు)ని దర్శించుకోవడం తగ్గిపోయింది. అయితే ఇప్పటికీ ప్రాచీన చరిత్ర తెలిసిన భక్తులు ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో పాలన


- రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పుల కుప్పగా మార్చింది
- గత పాలకుల తప్పిదాలను బయటకు తీస్తాం
- అంబేద్కర్ గొప్ప సామాజికవేత్త
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మంవన్‌టౌన్: రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో పాలన అందిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలను స్థానిక డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తర్వాత భట్టి మాట్లాడుతూ.. ప్రపంచ మేధావిగా వివిధ దేశాల చట్టాలను అధ్యయనం చేసి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన గొప్ప సామాజిక వేత్త అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో తమ ప్రభుత్వంలో ప్రతీ పేదవాడికి న్యాయం చేసేలా సమష్టిగా ముందుకు సాగుతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల వ్యయాన్ని అపరిమితంగా పెంచారని, కాళేశ్వరం ప్రాజెక్ట్ అంచనాలను సైతం పెంచి రాష్ట్రంలో ఆర్థిక దోపిడీకి కల్వకుంట్ల కుటుంబం తెరలేపిందని ఆరోపించారు. రూ.లక్ష కోట్లు పెట్టి నిర్మించిన కాళేశ్వరం ఇప్పుడు నిరుపయోగంగా మారిందన్నారు. ఇంపోర్టెడ్ బొగ్గు తీసుకొచ్చి కాలుష్యం లేకుండా విద్యుత్ ఉత్పత్తి చేస్తామని చెప్పి అటు కేంద్ర ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను బీఆర్‌ఎస్ మోసం చేసిందన్నారు. అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని తమ చేతిలో పెడితే, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఒక్కొక్కటిగా సంక్షేమ ఫలాలను పేదలకు అందిస్తున్నామని చెప్పారు. నాణ్యమైన విద్యుత్‌ను కోత లేకుండా అందిస్తున్న తమపై దిగజారి విమర్శలు చేయడం బీఆర్‌ఎస్‌కు తగదన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనకు, తమ మూడు నెలల పాలనకు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రజా వ్యతిరేక పాలన అందించిన పార్టీలకు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఏపీ సీఎం జగన్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నామని, ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదని, అలాంటి కార్యక్రమాలు ఎవరు చేసినా సమాజానికి మంచిది కాదని అన్నారు. జగన్మోహన్‌రెడ్డిపై శనివారం జరిగిన రాళ్ల దాడిపై ఆయన స్పందించారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఒక్కరోజే అవకాశం



ఓటు నమోదుకు నేటితో ముగియనున్న గడువు

బూర్గంపాడు: అర్హులు ఓటు హక్కును నమోదు చేసుకునేందుకు సోమవారం (ఏప్రిల్ 15)తో గడువు ముగియనుంది. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండినవారు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. కొత్తగా నమోదు చేసుకునేవారు మే నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముంది. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటు హక్కు నమోదు కోసం అధికారులు అన్నిచోట్ల విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. యువతకు అవగాహన కల్పిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి అనుబంధ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఈ నెల 25న ప్రదర్శించనుంది. ఇప్పటికే బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్వో) గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 18 ఏళ్లు నిండిన యువతపై క్షేత్రస్థాయిలో ఆరా తీసి వారికి ఓటు హక్కు కల్పిస్తున్నారు. 2006 మార్చి 31 కంటె ముందు పుట్టిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇందుకోసం ఫారం–6 నింపి తగిన ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతపరిచి బీఎల్వోలకు అందించాలి. ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో అందరు చెక్ చేసుకోవాలి. గత నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటరు జాబితాలో పేరు లేకపోవటంతో కొందరు ఓటు హక్కు కోల్పోయారు. అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ఓటర్లు బీఎల్వోల వద్ద ఉన్న ఓటరు జాబితాను సరిచూసుకోవాలి. ఓటరు జాబితాలో పేరు లేకుంటే ఆధార్ కార్డు జిరాక్స్ బీఎల్వోలకు ఇచ్చి మళ్లీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి.

క్లుప్తంగా

రామయ్యకు కో(గో)టి తలంబ్రాల సమర్పణ


గోటి తలంబ్రాలతో రామాలయానికి చేరుకున్న భక్తులు

భద్రాచలం (భద్రాచలంటౌన్) : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే తిరుకల్యాణ మహోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను ఆదివారం భక్తులు సమర్పించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది భక్తులు కోటి గోటి తలంబ్రాలతో భద్రాచలం చేరుకున్నారు. రామాలయంలో అర్చకులు ఈ తలంబ్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు అప్పారావు గత 13 ఏళ్లుగా రామయ్య కల్యాణం కోసం ప్రత్యేకంగా పండించిన వరి ధాన్యాన్ని ఆరు రాష్ట్రాల్లోని మహిళా భక్తులకు పంపిణీ చేస్తున్నారు. వారు వడ్లను ఒలిచి తలంబ్రాలు తయారు చేసి రామయ్యకు సమర్పిస్తున్నారు.

డిగ్రీ గురుకులాల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగింపు

రఘునాథపాలెం: మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు రఘునాథపాలెంలోని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథపాలెం బాలికల కాలేజీ, కొత్తగూడెంలో బాలుర కాలేజీ ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో ప్రవేశాలకు దరఖాస్తు గడువు 12వ తేదీ ముగియగా, 15వ తేదీ వరకు పొడిగించినందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముంచేసిన అభిమానం..!


అంబేడ్కర్ తల కనిపించకుండా వేసిన పూలమాలలు

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణం అంబేడ్కర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని అభిమానంతో వేసిన పూలమాలలతో ఆయనను ముంచేత్తాయి. ఆదివారం అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని పలువురు రాజకీయ, కుల, స్వచ్ఛంద సంఘాల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి భారీగా పూలమాలలు వేశారు. ఈనేపథ్యాన తల కనిపించకుండాపోయింది. ఇంకొందరికి అంబేడ్కర్ మెడలో పూలమాలలు వేసే వీలులేకపోవడంతో ఆయన చేతులకు తగిలించి వెళ్లారు.

పర్ణశాలలో నవమి ఏర్పాట్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ దామోదర్‌రావు

దుమ్ముగూడెం: పర్ణశాలలో జరిగే శ్రీరామనవమి ఏర్పాట్లను భద్రాచలం ఆర్డీఓ దామోదర్ రావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పర్ణశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్ణశాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, శానిటేషన్ పనులు ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీఓ ముత్యాలరావు, ఆర్‌ఐ ఆదినారాయణ, లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఆలయ అధికారి అనిత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూస్ జేఈ రాము తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్‌ను గుర్తిస్తే పారితోషికం


గుర్తుతెలియని వ్యక్తి

ఖమ్మంక్రైం: నగరంలో శనివారం రోటరీనగర్ వద్ద ఓ వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కొని పోవటానికి యత్నించిన గుర్తుతెలియని వ్యక్తి ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తామని నగర ఏసీపీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వృద్ధురాలు పెనుగులాడటంతో ఆ వ్యక్తి బైపాస్ రోడ్డువైపు ఎఫ్–జడ్ ద్విచక్రవాహనంపై పారిపోయాడని, ఆయన సమాచారం తెలిస్తే ఖమ్మం ఏసీపీ 87126 59105, టూటౌన్ సీఐ 87126 59110 నంబర్లకు ఫోన్‌చేసి చెప్పాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తులు బైకులపై ఎదురుగా, వెనుక నుంచి వస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నల్ల సూరీలకు నిరాశే..!

- గని కార్మికులను ఊరిస్తున్న ఇన్‌కమ్ టాక్స్ రద్దు
- కష్టం సంవత్సరకాలం.. జీతం తొమ్మిదినెలలే
- ఆదాయ పన్ను రూపంలో పోతున్న మూడు నెలల వేతనం
- ఎన్నికల సమయాన వరుస హామీలు
- ప్రభుత్వాలు మారినా..తప్పని చెల్లింపులు


భూ గర్భ గనుల్లో పనిచేస్తున్న సింగరేణి కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులు సైనికులని.. ప్రకృతికి విరుద్ధంగా పనిచేసే ధీరులని, వేలాది పరిశ్రమలకు ఇంధనం, వెలుగులు, లక్షలాది మంది కార్మికులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పించే నల్ల సూరీల ఇన్‌కమ్ టాక్స్ రద్దు కలగానే మిగిలింది. ఏళ్లు గడిచినా, ప్రభుత్వాలు మారినా.. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా వాటిని ఆచరించే సరైన నాయకులు లేరనే వాదనలు సింగరేణి వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. కుటుంబ అవసరాల కోసం సంవత్సరం పొడవునా వందల అడుగుల లోతుల్లో రక్తాన్ని చెమటగా మార్చి కష్టపడి పనిచేసిన సింగరేణి కార్మికులకు మూడు మాసాల వేతనం ఇన్‌కమ్ టాక్స్ రూపంలో చెల్లించి 9 మాసాల వేతనం గడపాల్సి వస్తుంది.

పట్టించుకోని పాలకులు..

ఎన్నికల సమయాన కేంద్ర, రాష్ట్ర పాలకులు తాము ఎన్నికల్లో గెలిస్తే, మీకు ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేయిస్తామని, గత కొన్నేళ్లుగా హామీ ఇస్తున్నారే తప్ప వాటిని అమలు చేయడం లేదు. తెలంగాణలో పదేళ్లుగా ఏకదాటిగా పాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014లో గెలిచిన తొలినాళ్లలోనే అసెంబ్లీలో బిల్లు పెట్టించి పార్లమెంట్‌కు ఆమోదం కోసం పంపించి ఆపై చేతులు దులుపుకుంది. సుమారు 60వేల మంది కార్మికుల ఓట్లతో గెలిచి అధికారం చేపట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి భవిష్యత్‌ను పట్టించుకున్న పాపాన పోలేదు.

9 నెలల వేతనంతోనే కుటుంబ పోషణ..

గాలి, వెలుతూరు లేని, కనిపించి, కనిపించని గులాయిల్లో, గనుల్లో, గ్రేడ్‌లో, బురదలో, టాప్ నుంచి నీరు కారుతున్నా, మంచినీటి సౌకర్యం లేకపోయిన నిత్యం కంపెనీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్న కార్మికులు సంవత్సరం అంతా కష్టపడితే వాటిలో సుమారు 3 నెలల వేతనాన్ని ఇన్‌కమ్ టాక్స్ రూపంలో చెల్లిచాల్సి వస్తుంది. దీంతో కేవలం 9నెలల జీతంతో మాత్రమే జీవనం సాగించాల్సి వస్తుంది. సంస్థలో పనిచేసే సుమారు 42 వేల మంది కార్మికులు కష్టపడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.వేల కోట్లు వివిధ ట్యాక్స్‌ల రూపంలో చెల్లిస్తున్నారు. వీటిలో కొంత కార్మికులకు ఇన్‌కమ్ ట్యాక్స్‌ను ప్రభుత్వాలు చెల్లించవచ్చు కానీ ఒకవైపు రాయితీల పేరుతో రూ.కోట్లు తీసుకుంటూ, మరోవైపు జీతంలో రూ.కోట్లను టాక్స్‌ల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేస్తున్నాయి. ఇలా రెండు రకాల టాక్స్‌లు వసూలు చేయకుండా ఏదో ఒకటి మాత్రమే అమలు చేస్తే బాగుంటుందని కార్మికులు కోరుతున్నారు.

పదేళ్లుగా సంస్థ చెల్లింపు..

గడచిన పదేళ్లలో వివిధ పన్నుల రూపంలో రూ.49,666 కోట్లను సింగరేణి సంస్థ చెల్లించింది. ఈనేపథ్యాన 2014–15 నుంచి 2023–24 వరకు కేంద్రానికి 26,207.59 కోట్లు చెల్లించగా, రాష్ట్రానికి 23,446.19 కోట్లు, ఒరిస్సా ప్రభుత్వానికి 12.54 కోట్లు ఇలా మొత్తం రూ.49,666 కోట్లు చెల్లించింది. ఇన్ని రూ.కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల రూపంలో చెల్లించినప్పటికీ ప్రభుత్వాలకు సింగరేణి కార్మికుల పట్ల జాలి కలగకపోవడం, వారి చెల్లింపులో జాప్యం చేస్తే వారిపై జరిమానాలు విధించడం సరికాదని కార్మికులు వాపోతున్నారు. కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ రద్దుచేయాలని ప్రకటనలు చేస్తున్న కార్మిక సంఘాలు వాటి కార్యరూపంలో జాప్యం చేస్తుందనే వాదనలు కార్మికుల నుంచి వినిపిస్తున్నాయి.

టాక్స్ రద్దు చేయాలి..



ఎన్నికల సమయాన ప్రజా, కార్మిక సంఘాల నాయకులు కార్మికులకు ఇన్‌కమ్ టాక్స్ రద్దు చేస్తామని ప్రకటిస్తున్నారే తప్ప అమలు చేయటం లేదు. ఎంతో కష్టపడి సంపాదించిన సొమ్ములో 1/3వంతు పన్నుల రూపంలో చెల్లించి మిగిలిన దాంట్లో జీవనం గడపాల్సి వస్తుంది. కార్మిక సంఘాల నాయకులు ఈ గడ్డు సమస్య నుంచి కార్మికులకు ఊరట కలిగిస్తే బాగుంటుంది.

– దల్‌సింగ్, పీవీకే–5 ఇంక్లయిన్ కార్మికుడు

బిల్లు ఆమోదానికి కృషి చేయాలి..



గడచిన పదేళ్లలో రూ.49,666 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంస్థ వివిధ పన్నుల రూపంలో చెల్లిస్తుంది. అంతేకాక కార్మికుల కష్టార్జితంలో 3 మాసాల వేతనం, అధికారులది 5 మాసాల వేతనం ఇన్‌కమ్ టాక్స్ రూపంలో కట్టాల్సి వస్తుంది. ఈ విధానంలో ఏదో ఒకటి మాత్రమే చెల్లించేలా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అమోదింప చేస్తే బాగుంటుంది.

– ఆంటోటి నాగేశ్వరరావు, సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

మావోయిస్టుల బంద్ పిలుపుతో అప్రమత్తం

- అణువణువునా కొనసాగుతున్న పోలీసుల తనిఖీ
- సరిహద్దు ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్ ఆపరేషన్


చర్ల శివారులో తనిఖీ చేస్తున్న పోలీసులు

చర్ల: ఆపరేషన్ కాగర్ పేరుతో బీజేపీ ప్రభుత్వం ప్రజలు, విప్లవోద్యమంపై సాగిస్తున్న ఫాసిస్టు మారణకాండకు వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీ ఈ నెల 15వ తేదీన ఐదు రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యాన పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్ర, ఒరిస్సా, మహారాష్ట్ర సరిహద్దుల్లో పెద్ద ఎత్తున పోలీస్ బలగాలను మోహరించడంతో పాటు పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సరిహద్దుల్లోకి చేరిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, కోబ్రా, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీ60 కమాండోస్, ఐటీబీటీ బలగాలు పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్‌ను కొనసాగిస్తూ అటవీ ప్రాంతాల్లో అణువణువునా గాలిస్తున్నారు. ఇటీవల సరిహద్దుల్లోని పోలీసు క్యాంపులపై మావోయిస్టులు ముప్పేట దాడులకు దిగిన ఘటన ల నేపథ్యాన ఆయా క్యాంపుల సమీపాల్లో గస్తీని ముమ్మరం చేయడంతో పాటు డ్రోన్‌ల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సరిహద్దు గ్రామాల్లో పెద్ద ఎత్తున కూంబింగ్ కొనసాగిస్తునే ఆదివాసీ గ్రామాల్లో నివాసముంటున్న వ్యక్తుల వివరాలను సేకరిస్తూ అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నట్లు సమాచారం. మావోయిస్టులు బంద్‌లు, వారోత్సవాలు, ఇతరత్రా పిలుపునిచ్చిన సందర్భాల్లో పోలీసు బలగాలు మోహరించడం, అనుమానితులను అదుపులోకి తీసుకోవడం, విచారించడం పరిపాటిగా వస్తున్నప్పటికీ ఇటీవల కాలంలో బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లో పెద్ద ఎత్తున ఎదురుకాల్పుల ఘటనలు చోటు చేసుకోవడం, 23 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యా మళ్లీ ఎక్కడ తుపాకీ మోత మోగుతుందోనని సరిహద్దు ఆదివాసీలు భయాందోళనలు చెందుతున్నారు.అంతేకాక అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను పోలీసులు అప్రమత్తం చేయడంతో పాటు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. అదే విధంగా భద్రాచలం నుంచి వాజేడు, వెంకటాపురం, ప్రాంతాలకు భద్రాచలం నుంచి కుంట, జగదల్‌పూర్ ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులను నిలినివేయడంతో పాటు ప్రైవేట్ వాహనాల రాకపోకలను సైతం నిలుపుదల చేశారు. పోలీసు ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసుకుంటూ.. మావోయిస్టుల వల్ల ఎటువంటి విపత్కర పరిస్థితులు చోటు చేసుకోకుండా వ్యవహరిస్తున్నారు.

వారపు సంతకు ఎండదెబ్బ..

- కొనుగోలు చేసేందుకు రాని జనం
- విక్రయాలు లేకపోవడంతో వెనుదిరిగిన చిరువ్యాపారులు


కొనుగోలుదారులు రాక వెలవెలబోతున్న వారపు సంత

చర్ల: చర్ల వారపుసంతకు ఎండదెబ్బ తగిలింది. గత నెల రోజులుగా అల్లాడిస్తున్న ఎండ తాజాగా ఆదివారం కూడా గడగడలాడించింది. ఆదివారం మండలంలో 37 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదవడంతో కొనుగోలుదారులు పెద్దగా సంతలో సరుకులు కొనుగోలు చేసేందుకు రాలేదు. దీంతో విక్రయాలు లేకపోవడంతో చిరువ్యాపారులు వెనుదిరిగారు. సాధారణంగా చర్లలో జరిగే వారపు సంతకు చర్ల, దుమ్ముగూడెం, వెంకటాపురం మండలాలకు చెందిన వ్యాపారులతో పాటు కొనుగోలుదారులు సుమారు 10 నుంచి 12 వేల మంది వరకు వస్తుంటారు. అయితే ఎండ తీవ్రత కారణంలో కేవలం 3 వేల నుంచి 4 వేల మంది మాత్రమే కొనుగోలుదారులు సంతలో సరుకులు కొనుగోలు చేసేందుకు రావడంతో వ్యాపారాలు సాగక చిరువ్యాపారులు ఉసురుమంటూ సంతలో గడపాల్సి వచ్చింది.

మరో రెండు నెలలు గడ్డుకాలం..

ఏప్రిల్‌లోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే వచ్చే రెండు నెలల్లో చిరువ్యాపారులకు గడ్డుకాలం తప్పేలా లేదు. కూరగాయలు, ఆకుకూరలు, తినుబండారాలు, నిత్యావసరాలు అమ్ముకునే వ్యాపారులు తమ వ్యాపారాలను ఎలా సాగించాలోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో ఏటా జనవరి, ఫిబ్రవరి అడపాదడపా వర్షాలు కురవడం.. వాతావరణం కాస్తా చల్లబడడం జరుగుతూ ఉండేది. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఉండడంతో ఫిబ్రవరి నుంచే ఎండలు దంచి కొడుతున్నాయి. ఏది ఏమైనా వరుణుడు కాస్తా కరుణిస్తే గానీ వాతావరణం చల్లబడే అవకాశం ఉంది.

మద్దుకూరులో ఇళ్ల మధ్య దారి వివాదం


ఇంటికి వెళ్లే దారికి కంచె వేసిన దృశ్యం

చంద్రుగొండ: మండలంలోని మద్దుకూరు గ్రామంలో బొడ్రాయి బజార్‌లో ఓ ఇద్దరు వ్యక్తుల ఇళ్ల మధ్య దారి విషయమై వివాదం నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చింతల బాలకృష్ణ, అదేగ్రామానికి చెందిన బూర్గు మనిషతో గత నాలుగేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. అప్పట్లోనే బొడ్రాయి బజార్‌లో చింత రామకృష్ణ వద్ద మూడు కుంటల ఇళ్ల స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకున్నాడు. ఆ ఇంటి ముందు భాగంలో నక్కెడ సీతారాములు ఇల్లు ఉండగా.. ఆ ఇంటి వెనుక ఉన్న ఖాళీస్థలం నుంచే నుండే బాలకృష్ణ ఇంటికి వెళ్లేందుకు దారి ఉంది. ఇటీవల ఆ దారిని కలుపుకుని సీతారాములు కంచె కట్టడంతో వివాదం మొదలైంది. ఆ స్థలమంతా తనదేనని సీతారాములు వాదిస్తుండగా.. తనకు దారి ఇవ్వారని రామకృష్ణ చెబుతున్నాడు. నేను కులాంతర వివాహం చేసుకున్నాననే అక్కసుతోనే దారి మూసివేశారని రామకృష్ణ చెబుతున్నాడు. ఈ విషయమై రామకృష్ణ పోలీసులను ఆశ్రయించడంతో ఎస్‌ఐ మాచినేని రవి సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ వివాదం రాజకీయ రంగుపులుముకోవడంతో వివాదం జఠిలంగా మారింది. వివాదంపై విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాలిక కిడ్నాప్‌పై పోక్సో కేసు నమోదు

చంద్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలో ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి వివాహం చేసుకున్న అదే గ్రామానికి చెందిన చాపలమడుగు సాంబశివరావుపై ఆదివారం పోక్సో కేసు నమోదైంది. ఎస్‌ఐ మాచినేని రవి కథనం ప్రకారం.. గ్రామంలోని పిన్ని ఇంటి వద్ద ఉంటున్న మైనర్ బాలికను, పిన్ని భర్త అయిన సాంబశివరావు మాయమాటలతో శారీరకంగా లోబచుకున్నాడు. ఇదే క్రమంలో ఈనెల 6వ తేదీన బాలికను కిడ్నాప్ చేసి పాల్వంచ తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లో కొన్నిరోజులు గడిపి 13వ తేదీన తిరిగి ఇంటికి వచ్చాడు. దీంతో బాలిక తల్లి పోలీసులను ఆశ్రయించగా.. తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం జిల్లా నలుమూలలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా సందర్శకులు తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 353 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.10,060 ఆదాయం, 150 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.6,540 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

తాగునీటి కోసం వెళ్లి అనంతలోకాలకు..

ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి


నాగరాజు(ఫైల్)

దమ్మపేట: తాగునీటి కోసం వ్యవసాయ క్షేత్రంలో గల నీటికుంట వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందిన సంఘటన మండలంలోని అల్లిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని గంగులగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి నాగరాజు(34) మరో ఐదుగురు వ్యక్తులతో కలిసి ఆదివారం అల్లిపల్లి గ్రామంలో కొబ్బరి బొండాలు కోత కోసే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో పెనుబల్లి నాగరాజుకు దాహం వేయగా, అదే తోటలో ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లాడు. కుంటలో నీరు తాగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతి చెందాడు. తాగు నీటి కోసం వెళ్లిన వ్యక్తి ఎంత సేపటికి రాకపోవడంతో తోటి కూలీలు వెళ్లి చూడగా నీటి కుంటలో మృతి చెంది ఉండటం గమనించారు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి పెనుబల్లి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా..


వినోద్(ఫైల్)

సుజాతనగర్: స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి చివరకు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన కొత్త అంజనాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వజ్జా నర్సింహారావు, రుక్మిణి దంపతుల కుమారుడు వినోద్(17) కొత్తగూడెంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలసి స్థానిక చేపల చెరువుకు ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో ఈత కొడుతూ కొంత సేపటి తర్వాత అందరూ ఒడ్డుకు వచ్చినా.. వినోద్ మాత్రం ఒడ్డుకు చేరలేదు. ప్రమాదవశాత్తు ఊబిలో చిక్కి ప్రాణాలు కోల్పోయాడు. వినోద్ కుటుంబీకులకు అతడి స్నేహితులు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబసభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కేటీపీఎస్ ఆర్టిజన్ ఇంట్లో పోలీసుల తనిఖీ

పాల్వంచరూరల్: మండల పరిధి బిక్కుతండాలో నివాసం ఉంటూ.. కేటీపీఎస్ ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న భరత్ ఇంట్లో శనివారం రాత్రి పాల్వంచ, బూర్గంపాడుకు చెందిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ఇంట్లో కొంత నగదు, బంగారు ఆభరణాలు లభించినట్లు సమాచారం. అదేవిధంగా పట్టణంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లల్లోనూ పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట(ములకలపల్లి): అక్రమంగా తరలిస్తున్న ఓ ఇసుక ట్రాక్టర్‌ను పోలీ సులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని గుర్రాలకుంట శివారు మొర్రేడు వాగు క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున దాడులు నిర్వహించగా ఒక ట్రాక్టర్ పట్టుబడగా.. సీజ్ చేసినట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బూర్గంపాడు: ఈ నెల 10వ తేదీన సారపాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సారపాకకు చెందిన కర్రి ఉపేందర్(35) అలియాస్ ఉప్పులు ఈ నెల 10వ తేదీన ఆటోలో వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడడంతో ఆయనను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కానీ అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున ఉపేందర్ మృతిచెందాడు. మృతుడి సోదరుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఫంక్షన్ గదిలోకి తొంగిచూసిన విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. దీంతో ఇద్దరిపై దాడి చేసిన ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలపరిధి లక్ష్మీదేవిపల్లికి చెందిన గన్నవరపు రమేష్ ఆదివారం పెద్దమ్మగుడి వద్ద ఫంక్షన్ చేసుకుంటున్నాడు. ఆయన ఫంక్షన్ చేసుకునే గది పక్కన కొత్తగూడెంకు చెందిన యువకులు మరో ఫంక్షన్ చేసుకుంటున్నారు. ఈక్రమంలో రమేష్ పక్కగదిలోకి తొంగిచూడడంతో గొడవ మొదలైంది. దీంతో రమేష్‌తో పాటు కటారి రాణి అనే మహిళపై దాడిచేశారని పోలీసులకు బాధితులు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన పొన్నం కోటేశ్, చీమకూరి సాంబమూర్తి, గాదే సాయి నిఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శ్రీరాములు తెలిపారు.

లక్ష్మీపురం మద్యం దుకాణాల్లో చోరీ

బూర్గంపాడు: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రెండు మద్యం దుకాణాల్లో శనివారం రాత్రి చోరీలు జరిగాయి. వైన్ షాపుల షట్టర్ల తాళాలు పగలగొట్టి దొంగలు లోపలికి జొరబడి దుకాణాల కౌంటర్లలలో నగదు లేకపోవటంతో దొంగలు మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లారు. దీంతో దుకాణాదారులు ఈ చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు దుకాణాల వద్దకు వెళ్లి దర్యాప్తు చేపట్టారు.

9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్..

భద్రాచలం (భద్రాచలం అర్బన్): పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన పట్టణ పరిధిలో గల ఓ కాలనీలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. భద్రాచలం టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాచలం టౌన్ పోలీసులు దాడి చేశారు. దీంతో 9మంది పట్టుబడగా.. వారి వద్ద నుంచి రూ.85 వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరిలో మృతదేహం లభ్యం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో నివసించే లారీ డ్రైవర్ మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయి ఆదివారం మల్లేపల్లి గోదావరిలో శవమై తేలాడు. మణుగూరులో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను స్థానికుల ఇలా తెలిపారు. టిప్పర్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న బండ్ల సాయికుమార్(24) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో బంధువులు, తదితర ప్రాంతాల్లో ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. చివరకు మల్లేపల్లి గోదావరిలో ఓ మృతదేహం కుళ్లిపోయి చేతికి ఉంగరం, పచ్చబొట్టు ఉండడంతో ఆయన కుటుంబీకులు సాయికుమార్ అని గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట: జీవితం మీద విరక్తి చెందిన ఓ వ్యక్తి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను పోలీసులు ఇలా తెలిపారు. సీతారాంపురం గ్రామానికి చెందిన చిన్నంశెట్టి మారేశ్వరరావు (40) తన భార్యతో వివాదం చోటుచేసుకోవడంతో ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోగా గత కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిసై రోజూ మద్యం సేవించేవాడు. ఈక్రమంలో జీవితం మీద విరక్తి చెందిన అతడు మద్యం తాగిన మత్తులో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి సోదరుడు కేశవరావు శనివారం రాత్రి వెళ్లి చూడగా.. అప్పటికే మృతి చెంది ఉండడాన్ని గమనించి విషయాన్ని పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట మార్చురీకి తరలించగా.. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చీమ తెలిపారు.